# కలం
ప్రజల గళం...

kalamdaily.com

Follow on: Kalamtelugu

మంగళవారం • 31-03-2026


SINGLE PAGE TOPIC

కవిత - పాలిటిక్స్

> బీఆర్ఎస్ పాలనలో అనేక వర్గాలకు అన్యాయం జరిగింది. నేను ఇన్నేండ్లు అదే పార్టీలో ఉండి ఏమీ చేయలేకపోయాను. అందుకు నన్ను క్షమించండి.
>
> ... తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇటీవల తరచూ చెప్తున్న మాట ఇది..

బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పులను కవిత ఒప్పుకుంటున్నారు. అన్యాయం జరిగిన వర్గాలకు బహిరంగంగా క్షమాపణలు చెప్తున్నారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇస్తున్నారు. ఆయా వర్గాల సమస్యలు పరిష్కారమయ్యే వరకు కొట్లాడతానని హామీ ఇస్తున్నారు.

త్వరలో కొత్త పార్టీ పెట్టబోతున్న కవిత చెప్తున్న మాటల్లో, క్షమాపణల్లో నిజమెంత? ఆమె నిజంగానే అమరుల కుటుంబసభ్యులు, ఉద్యమకారులు, బీసీలకు తన పార్టీలో ప్రాధాన్యం ఇస్తారా? రైతులు, ఉద్యోగులు, ఇతర వర్గాల సమస్యలను పరిష్కరిస్తారా? బీఆర్ఎస్‌లో తెలిసో, తెలియకో జరిగిన తప్పులను ఇప్పుడైనా సరిదిద్దుకుంటారా? లేదంటే సారీలతోనే సరిపెడ్తారా?

కేవలం ఓట్ల కోసమే కవిత ఈ క్షమాపణలు చెప్తున్నారా? దీనికి ఆమె భవిష్యత్ ఆచరణే క్లారిటీ ఇస్తుంది. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న తండ్రి తరహాలోనే ఇప్పుడు కవిత సైతం 'సామాజిక తెలంగాణ' అంటూ నినదిస్తున్నారా? ఆమె నిజాయితీ, చిత్తశుద్ధి భవిష్యత్ కార్యాచరణలో రిఫ్లెక్ట్ అవుతుందా? పార్టీ కమిటీల్లో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, మహిళలు, నిరుద్యోగులు, భూనిర్వాసితులు తదితరులకు చోటు కల్పిస్తారా?.. రాబోయే ఎన్నికల్లో వీళ్లకు టికెట్లు దక్కే అవకాశం ఉంటుందా?.. వీటిపై కలం ప్రత్యేక కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం

# క్షమాపణలన్నీ ఓట్ల కోసమేనా?



## బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పుల్లో తానూ భాగస్వామినేనని ఒప్పుకుంటున్న కవిత

### అన్యాయం జరిగిన వర్గాలకు బహిరంగంగా క్షమాపణలు

### బాధిత వర్గాలకు జాగృతి పార్టీలో తగిన ప్రాధాన్యమిస్తారా?

### ఓటు బ్యాంక్ పాలిటిక్స్ కోసమే ఆమె ఓదార్పు మాటలా?

## ఎప్పుడెప్పుడు? ఎవరెవరికి? సారీలు..



### 2025 అక్టోబర్ 25: అమరవీరులు, ఉద్యమకారులు

తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులు, కొట్లాడిన ఉద్యమకారులకు హైదరాబాద్ నాంపల్లిలోని అమరవీరుల స్థూపం వేదికగా కవిత క్షమాపణలు చెప్పారు. 2025 అక్టోబర్ 25న 'జాగృతి జనం బాట' కార్యక్రమం ప్రారంభానికి ముందు ఆమె అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి మీడియాతో మాట్లాడారు.


''తెలంగాణ ఉద్యమంలో దాదాపు 1,200 మంది అమరులయ్యారు. కానీ వాళ్ల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోయాం. కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చాం. ఉద్యమకారులకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ టికెట్లు దక్కినప్పటికీ.. వాళ్లకు జరగాల్సిన న్యాయం జరగలేదు. నేను మంత్రిగా లేకపోయినప్పటికీ, ఒక ఎంపీగా అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు న్యాయం జరగాలని పార్టీ అంతర్గత వేదికల్లో పదేపదే అడిగాను. కానీ అందరికీ న్యాయం జరిగే వరకు కొట్లాడలేకపోయాను. అందుకు బహిరంగ క్షమాపణ చెప్తున్నాను. అమరవీరుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.కోటి పరిహారం పంపిణీ చేయాలి. ఈ డిమాండ్‌ను కాంగ్రెస్ సర్కార్ నెరవేర్చకపోతే, వచ్చే ప్రభుత్వంలో తప్పక ఇప్పిస్తాం'' అని కవిత హామీ ఇచ్చారు.



### 2025 డిసెంబర్ 23: ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు

'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా 2025 డిసెంబర్ 23న యాదాద్రి భువనగిరి జిల్లాలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా రాయగిరిలో ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులను కలిశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసినందుకు క్షమాపణలు చెప్పారు. ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులకు న్యాయం జరిగేదాకా కొట్లాడతానని హామీ ఇచ్చారు.

''బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసిన విషయం నాకు తెలియదు. తెలిసి ఉంటే రైతుల పక్షాన కొట్లాడేదాన్ని. బీఆర్ఎస్‌లోనే ఉండి మీకోసం కొట్లాడనందుకు నన్ను క్షమించండి. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ఎవరికి ఇష్టమొచ్చినట్టు వాళ్లు తిప్పారు. ఇప్పటికే మూడుసార్లు మార్చారు. యాదగిరిగుట్ట అవతలి నుంచి రావాల్సిన రోడ్డును ఇవతలికి మార్చారు. అలైన్‌మెంట్ మార్పు వెనుక పెద్ద అవినీతి జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భూములు కాపాడడం కోసం రైతులకు అన్యాయం చేశారు. మీరెవరూ అధైర్యపడొద్దు. అలైన్‌మెంట్ మార్పు కోసం మనందరం కలిసి కొట్లాడుదాం. అవసరమైతే కేంద్రమంత్రి గడ్కరీ అపాయింట్‌మెంట్ కోరుతాను'' అని కవిత చెప్పుకొచ్చారు.



### 2026 మార్చి 29: అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

తెలంగాణ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో 2026 మార్చి 29న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఇందులో కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయామని, ఈ విషయంతో తనను క్షమించాలని కోరారు.

''తెలంగాణ వస్తే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ ఉండదని భావించాం. కానీ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పర్మినెంట్ ఉద్యోగాలనే అవుట్ సోర్సింగ్‌గా మార్చేశారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకోలేదు. ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి మీ సమస్యలను పరిష్కరించలేకపోయాను. అందుకు నన్ను క్షమించండి. తెలంగాణ ఉద్యమంలో చేపట్టిన మిలియన్ మార్చ్ తరహాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కొట్లాడితే సమస్యలు పరిష్కారమవుతాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. మేం అధికారంలోకి వస్తే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే విధానమే లేకుండా చేస్తాం'' అని కవిత తెలిపారు.

### 2025 డిసెంబర్: బీసీలు

2025 డిసెంబర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దీనికి కవిత హాజరై మాట్లాడారు. బీసీలకు బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని, అందుకు తాను క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు.

''బీసీలకు బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసింది. రాజకీయాలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీ రిజర్వేషన్లు, వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇందుకు నేను కూడా బాధ్యత వహిస్తున్నాను. అందుకే బీసీలకు క్షమాపణలు చెప్తున్నాను'' అని కవిత పేర్కొన్నారు.

### తప్పులు ఒప్పుకోలు..

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన కవిత.. అనంతరం ఆ పార్టీ నుంచి పూర్తిగా తెగదెంపులు చేసుకున్నారు. ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. రాజకీయ శక్తిగానే మళ్లీ చట్టసభల్లో అడుగుపెడతానని శపథం చేశారు. బీఆర్ ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో జరిగిన తప్పులు, అన్యాయాలను తన పర్యటనల్లో, సభల్లో, మీడియా సమావేశాల్లో ఆమె ప్రస్తావిస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు, ఉద్యోగులు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, బీసీలు, ఇతర వర్గాలకు అన్యాయం జరిగిందని ఒప్పుకుంటున్నారు. ఆనాడు అదే పార్టీలో ఉన్నప్పటికీ తాను ఏమీ చేయలేకపోయాయని కవిత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకు తనను క్షమించాలంటూ ఆయా వర్గాలను వేడుకుంటున్నారు. జనం జాగృతి బాట, ఇతర కార్యక్రమాల్లో భాగంగా ఆయా వర్గాలను కలిసినప్పుడు వాళ్లకు బహిరంగంగా క్షమాపణలు చెప్తున్నారు.



### పార్టీలో ప్రాధాన్యం ఇస్తారా?

బీఆర్ఎస్ పాలనలో అన్యాయం జరిగిన వర్గాలకు కవిత క్షమాపణలు చెప్పడం మంచి పరిణామమేనని బాధిత కుటుంబాలు అంటున్నాయి. కానీ సారీలతోనే ఆమె సరిపెడ్తారా? లేక ఆయా వర్గాలను ఆదుకునేందుకు అడుగులు వేస్తారా? లేదా? అన్నదే ఇప్పుడు కీలకం. కొత్త పార్టీ పెడ్తానని కవిత ఇప్పటికే తెలిపారు. ఏప్రిల్ 25న పార్టీని ప్రకటించనున్నారు. కార్యక్రమానికి రావాలంటూ అన్ని వర్గాలకు పిలుపునిచ్చారు. మరి ఆ పార్టీలో అమరవీరుల కుటుంబసభ్యులకు, ఉద్యమకారులకు, బీసీలకు ఎలాంటి ప్రాధాన్యం ఇస్తారు? అధికారంలోకి వస్తే రైతులు, ఉద్యోగులు, మహిళలు, బీసీలు, ఇతర వర్గాల కోసం ఏం చేస్తారు? అన్నది ముఖ్యం. తనను బహిష్కరించిన బీఆర్ఎస్‌ను వేలెత్తిచూపేందుకే కవిత ఆ పార్టీ తప్పులను ఒప్పుకుంటున్నారా? కేవలం తన కొత్త పార్టీకి ఓట్ల కోసమే ఆమె క్షమాపణలు చెప్తున్నారా? బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఏమైనా ఆదుకుంటున్నారా? సారీలు చెబుతూ బీఆర్ఎస్‌పై అస్త్రాలు సంధించేందుకు అధికార కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తున్నారా? అనేది చర్చనీయాంశం.